క్లుప్తంగా

వృద్ధాశ్రయానికి నిత్యావసర వస్తువులు



ప్యాపర్రు(వేమూరు): ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని మాజీ ఎంపీపీ మైనేని రత్న ప్రసాద్ చెప్పారు. అమర్తలూరు మండలంలోని ప్యాపర్రు గ్రామంలో వృద్ధాశ్రయానికి నిత్యావసర వస్తువులను గురువారం పంపిణీ చేశారు.వేముల పల్లి శ్రీధర్, నార్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో బధవారం రాత్రి ప్రమాదవశాత్తూ పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన చేబ్రోలు యాకోబు ఒంటి నిట్టాడు ఇల్లు అగ్నికి ఆహుతి అయ్యింది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న వస్తువులు అన్నీ దగ్ధమయ్యాయని రేపల్లె స్టేషన్ ఫైర్ ఆఫీసర్ వై. సాంబశివరావు గురువారం తెలిపారు. ఈ ప్రమాదంలో ప్రాణ నష్టం జరగలేదని, మంటలను ఆర్పి నియంత్రించినట్లు చెప్పారు. ప్రమాదానికి కారణం తెలియలేదని పేర్కొన్నారు.

సూరేపల్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్

సూరేపల్లి(భట్టిప్రోలు): గ్రామీణ ప్రాంతంలోని మారుమూల గ్రామాలకు సైతం వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ ఎంతగానో రోగులకు దోహదపడుతుందని సూరేపల్లి సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు మోర్ల విజయలక్ష్మి, రావు రాజేశ్వరిలు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం సూరేపల్లి సచివాలయం వద్ద గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. భట్టిప్రోలు పీహెచ్‌సీ వైద్యుడు ఎ.శ్రీనివాసరావు వైద్యసేవలు అందించారు. ఏఎన్ఎం అరుణజ్యోతి, ఎంఎల్‌హెచ్‌పీ డి.నాగరాణి, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిర సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు



పిట్టలవానిపాలెం: సుస్థిర సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని బాపట్ల ఏడీఏ లక్ష్మి తెలిపారు. మండలంలోని ఖాజీపాలెంలో డాక్టర్ వైఎస్సార్ క్లస్టర్ పొలంబడిలో భాగంగా రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మినుము, వేరుశనగ పైర్లలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. విచక్షణా రహితంగా రసాయనిక పురుగు మందులు వినియోగించరాదని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ అనూరాధ, ఏఈఓ సత్యానంద్, బాపట్ల ఏఎంసీ వైస్ చైర్మన్ ఉయ్యూరి లీలాశ్రీనివాసరెడ్డి,ఖాజీపాలెం సొసైటీ చైర్మన్ కూసంపూడి దేవేంద్రరాజు, ఏఈఓ సుదర్శనరావు, వీఏఏలు, ఐసీఆర్‌పీలు ఉన్నారు.

ఘనంగా జెండాపండుగ

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు శివారు పెదహరిజనవాడలో గురువారం లూథరన్ ప్రార్థనా మందిరం వారు జెండాపండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. లూదరన్ పాస్టర్ ప్రత్యేక ప్రార్ధనల అనంతరం జెండాను గ్రామంలోని అన్ని వీధులలో ఊరేగింపు చేశారు. చందోలు ఎస్ఐ ఎస్.రాజశేఖర్ గ్రామస్తులకు జనవరి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గ్రామ ఉపసర్పంచి చేబ్రోలు వీరయ్య, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు చల్లాపల్లి విజయరాజు, సంఘపెద్దలు ఎస్ఐకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ప్రత్యేక ప్రార్ధనల అనంతరం ఆరు వేల మందికి అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మృతదేహంతో రోడ్డుపై ధర్నా

దుండిపాలెం(వేమూరు): అల్లుడి చేతిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన బ్రహ్మారెడ్డి కుటుంబానికి న్యాయం జరిగేవరకు ధర్నా చేస్తామని గ్రామస్తులు పేర్కొన్నారు. తన అల్లుడు ప్రశాంత్‌రెడ్డి చేతిలో కత్తిపోట్లకు గురై తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వ వైద్య శాలలో బ్రహ్మారెడ్డి బుధవారం రాత్రి మృతి చెందాడు. గురువారం మృత దేహానికి పోస్టు మార్టం చేసి దుండిపాలెం తీసుకొచ్చారు. దుండిపాలెం గ్రామంలో మెయిన్ రోడ్డుపై బ్రహ్మారెడ్డి మృత దేహం ఉంచి గ్రామస్తులు ధర్నాకు దిగారు. చుండూరు పోలీసులు వచ్చి ధర్నా విరమించాలని కోరారు. దీంతో గ్రామస్తులు గ్రామంలో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రశాంత్ రెడ్డి కుటుంబాన్ని గ్రామం నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు. చుండూరు సీఐ కల్యాణ్ రాజ్, ఎస్ఐ నవీన్ కుమార్ గ్రామస్తులకు ఎంత నచ్చచెప్పినా వినకుండా ధర్నా నిర్వహించారు.

తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి



పెనుమూడిలో ట్రాక్టర్ రివర్స్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు



కేఎస్‌కే విద్యాసంస్థలలో సంక్రాంతి సంబరాలలో భాగంగా జరిగిన కబడ్డీ పోటీలలో తలపడుతున్న విద్యార్థినులు

సంక్రాంతి సంబరాలను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు

రేపల్లె: తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి అని, సంస్కృతి, సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు తెలియజెప్పాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు అన్నారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పర్యవేక్షణలో సంక్రాంతి సంబరాలలో భాగంగా మండలంలోని పెనుమూడి నేషనల్ హైవే సమీపంలోని పొలాలలో గురువారం నిర్వహించిన ట్రాక్టర్ రివర్స్‌పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కృష్ణమ్మ పరివాహక ప్రాంతమైన పెనుమూడి గ్రామంలో సాంప్రదాయబద్ధంగా సంక్రాంతి వేడుకలను నిర్వహించుకోవటం ఆనందంగా ఉందన్నారు. వేడుకల్లో భాగంగా ట్రాక్టర్ రివర్స్ పోటీలతో పాటు దక్షిణ భారతదేశంలోని గొర్రె పొట్టేళ్ల ప్రదర్శన పోటీలు నిర్వహించటంతో ఈ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొందన్నారు. సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలలో భాగంగా 13వతేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు దక్షిణాది రాష్ట్రాల గొర్రెపొట్టేళ్ల పందెపు పోటీలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా వివిధ రంగాలలో రాణిస్తున్న పలువురికి సన్మాన కార్యక్రమాలు నిర్వహించబడునన్నారు. కార్యక్రమంలో రాష్ట్రహోంమంత్రి తానేటి వనిత, రాష్ట్రసాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి, దేవదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తదితరులు పాల్గొంటారని, ప్రజలు అధిక సంఖ్యలో కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

'కేఎస్‌కే'లో సంక్రాంతి సంబరాలు ..

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని కేఎస్‌కే ఇనిస్టిట్యూషన్స్‌లో సంక్రాంతి సంబరాలు గురువారం కూడా కొనసాగాయి. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా బొమ్మల కొలువు ఏర్పాటు చేసి రంగవల్లులు తీర్చిదిద్ది అందులో గొబ్బెమ్మలు పెట్టి కోలాటం ఆడుతూ విద్యార్థులు సందడి చేశారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు, కబడ్డీ, క్యారమ్స్, లెమన్ స్పూన్, పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. బీఈడీ, డీఈడీ, డిగ్రీ, కళాలల ప్రిన్సిపాల్స్ పి.రాజేష్ విక్టర్, ఎం.భాస్కరరావు, పి.స్వర్ణలత పర్యవేక్షించారు.

ప్రతి ఒక్కరూ దేవునిపై విశ్వాసం ఉంచాలి

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



ఎంపీ మోపిదేవి వెంకట రమణారావును సత్కరిస్తున్న ఎక్స్‌మిలటరీ కాలనీ సభ్యులు

నిజాంపట్నం: ప్రతి ఒక్కరూ దేవునియందు విశ్వాసం ఉంచాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండల కేంద్రమైన నిజాంపట్నం ఎక్స్‌మిలటరీ కాలనీలో గురువారం నిర్వహించిన జనవరి పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రేమ, కరుణ, దయలు యేసు మార్గాలన్నారు. సాటి జీవులపట్ల ప్రేమ, నిస్సహులపట్ల కరుణ, ఆకాశమంతటి సహనం, శతువులపట్ల సైతం క్షమాపణ ఇవన్నీ జీసెస్ తన జీవితం ద్వారా మానవులకు ఇచ్చిన మహోన్నత సందేశమన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవిని మండల ఉపాధ్యక్షులు చంటి, మోహన్ రావులు గజమాలలతో ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మోపిదేవి హరినాథ్ బాబు, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, నాయకులు నాజర్ ఖాన్, మోపిదేవి శ్రీనివాసరావు, కన్నా శ్రీనివాసరావు, ఎక్స్ మిలటరీ కాలనీ గ్రామస్తులు పెద్దలు పాల్గొన్నారు.

పట్టుదలతో పోరాడితేనే విజయం

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను సన్మానిస్తున్న భావపురి విద్యాసంస్థల నిర్వాహకులు

బాపట్లటౌన్: పట్టుదలతో పోరాడినప్పుడే విజయాలను సాధించగలరని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. బాపట్లలోని భావపురి విద్య సంస్థలో జాతీయ యువజనోత్సవం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడారు. కష్టపడి పనిచేస్తే ప్రపంచంలో సాధ్యం కానిది ఏది ఉండదన్నారు. యువత లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాని సాధన దిశగా అడుగులు వేయాలన్నారు. భావపురి కోచింగ్ సెంటర్‌లో ఎస్ఐ, కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న విద్యార్థులు వారి లక్ష్యాన్ని చేరుకోవడానికి ఏవిధంగా పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవ్వాలి, ఏవిధంగా ప్రిపేర్ అయితే విజయం సాధించవచ్చునో వివరించారు. భావపురి విద్యాసంస్థల చైర్మన్ ఆవుల వెంకటేశ్వర్లు మాట్లాడారు. రామకష్ణ సేవా సమితి కర్లపాలెం అధ్యక్షుడు తిమ్మరాజు సుబ్బారావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఎ. శ్రీనివాస్, బాపట్ల పట్టణ సీఐ పి.కృష్ణయ్య పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



శాస్త్రీ స్కూల్‌లో కేక్ కట్ చేస్తున్న చిన్నారులు



రామచంద్రరావు దంపతులకు వివేకానంద పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం

ఐలవరం(భట్టిపోలు): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను, హిందూ ధర్మ గొప్పతనాన్ని విదేశాల్లో చాటిన ఘనత స్వామి వివేకానందునికే దక్కుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. సమరసతా సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) వివేకానంద విద్యా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఐలవరంలో వివేకానందుని జయంతి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. వేణుగోపాల స్వామి దేవాలయంలో జరిగిన సభకు ఎస్ఎస్ఎఫ్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకర రావు అధ్యక్షత వహించారు. 2023 -వివేకానంద పురస్కారంను చెరుకుపల్లి మండలం కావూరు జూనియర్ కళాశాలకు చెందిన తెలుగు అధ్యాపకులు రామచంద్రరావుకు అందచేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు, కొతరపు గణేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భట్టిపోలు: వివేకానందుని స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని జెడ్పీటీసీ మాజీ సభ్యులు బండారు కుమారి కోరారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా భట్టిప్రోలుకు చెందిన బండారు శ్రీనివాసరావు స్వగృహంలో స్వామి వివేకానందుని ఉత్సవాలను వివేకానంద విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. బండారు శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో టీఎంరావు హైస్కూల్‌లో ఉపాధ్యాయుడు సీహెచ్‌వీ ఉమామహేశ్వరరావును సన్మానించారు. వరికూటి శివ గోపి, క్రాప రవి కుమార్, జంజనం హేమశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి: భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచ నలుమూలలకు చాటిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానందుడు అని ఎస్ఐ వెంకట కొండారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో స్వామి వివేకానంద జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని శాస్త్రీ స్కూల్ ఆవరణలలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి వివేకానందుడి సూక్తులను పఠించారు. పాఠశాల ఆవరణలలో 7వ తరగతి విద్యార్థి గొల్లపూడి ధీరజ్ వివేకానందుని వేషధారణతో ప్రత్యేక ఆకర్షణగా కనిపించాడు. కార్యక్రమంలో ఉప్పు సాంబశివరావు, కుంచా రాంమోహనరావు, అన్నపూర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్లపాలెం: వివేకానంద బోధనలు ఆచరణీయమైనవని తహసీల్దార్ జి.కేశవనారాయణరావు తెలిపారు. వివేకానంద 161వ జయంతి సందర్భంగా జరిగిన యువజనోత్సవాలలో భాగంగా గురువారం ఎంవీఆర్ డిగ్రీ కళాశాల, పీకేఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో వివేకానందుని చిత్రపటంతో శోభాయాత్రగా కర్లపాలెం ఐలాండ్ సెంటర్‌కు వెళ్లి అక్కడి నుంచి ఎంవీఆర్ డిగ్రీ కళాశాల వద్దకు వచ్చి వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భారతదేశ సంస్కృతిని సాంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన వ్యక్తి వివేకానందుడని తెలిపారు. ఎంవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్, పీకేఆర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు టీవీ సుబ్బారావు, ఆరె వెంకటేశ్వర్లు, రామకృష్ణ సేవా సమితి కార్యదర్శి వెంకటేశ్వరరావు, చందు పిచ్చయ్య ఉన్నారు.

ఐక్యతను చాటిచెప్పిన స్వామి వివేకానంద...

బాపట్ల అర్బన్: భారతీయులందరూ ఐక్యత కలిగిన వారిని ప్రపంచానికి చాటి చెప్పిన స్వామి వివేకానంద స్ఫూర్తిని కొనసాగించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. బాపట్ల జీబీసీ రోడ్లోని ఫుడ్ అండ్ సైన్సెస్ కళాశాల సమీపంలోని విశ్వశాంతి హైస్కూల్ నందు స్వామి వివేకానంద జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేసన మాట్లాడుతూ స్వామి వివేకానంద ఒక్క వ్యక్తిగా రెండు శతాబ్దాలు అందరినీ చైతన్య పరుస్తూ మరో కొన్ని వేల సంవత్సరాలు ఆదర్శానికి నిలవడానికి పాటించిన పద్ధతులు, విధానాలు నేటి యువత అవలంబించాలని సూచించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీనివాస రావు, యువనేత రహీం రెడ్డి, ఆవుల మహేష్, ఎస్ఎస్పీ రాజు, పిన్నిబోయిన శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న బత్తుల దేవానంద్

నగరం: విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ చెప్పారు. మండలంలోని నగరం, మంత్రిపాలెం గ్రంథాలయాలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ఝాన్సీలక్ష్మితో కలిసి గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. గ్రంథాలయాలలో ఎంతో విలువైన గ్రంథాలు, నవలలు, పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు అనేక పుస్తకాలు అందుబాటులో ఉంటాయని, పాఠకులు, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. నగరంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.25లక్షలు మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే భవన నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మంత్రిపాలెం, నగరం గ్రంథాలయాల అధికారులు జొన్న బ్రహ్మేంద్ర, పరిశా వెంకట కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

6న ఏరోస్పేస్ టెక్నాలజిస్టుతో ఐలవరం విద్యార్థుల ఆన్‌లైన్ సమావేశం

భట్టిప్రోలు: అమెరికాలోని నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ సంస్థ శాటిలైట్స్‌ను తయారు చేయడం, వాటిని స్పేస్‌లోకి పంపిచడం వంటివి చేస్తూ వినూత్న కార్యక్రమాల ద్వారా ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుంది. ఈ అత్యున్నత సంస్థలో జేమ్స్ ఆడమ్స్ డెప్యూటీ చీఫ్ టెక్నాలజిస్టుగా మూడున్నర దశాబ్దాలుగా ఏరోస్పేస్‌లో పని చేసి ఇటీవల రిటైర్ అయ్యారు. ఆయనకు ప్రపంచ వ్యాప్తంగా గొప్ప టెక్నాలజిస్టుగా మంచి పేరుంది. గ్రామీణ ప్రాంతంతో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఏరోస్పేస్ పట్ల అవగాహన కల్పించేందుకు భట్టిప్రోలు మండలం ఐలవరం జెడ్పీ హైస్కూల్‌లో ఆంగ్లోపాధ్యాయులుగా పని చేస్తున్న పచ్చారు హరికృష్ణ హెన్రీ ట్రూప్ అనే శాస్త్రవేత్త ద్వారా జేమ్స్‌ని ఆన్‌లైన్ ద్వారా కలసి తమ రాష్ట్రంలోని విద్యార్థులతో ఇంట్రాక్ట్ అయ్యేందుకు విజ్ఞప్తి చేయగా అందుకు ఆయన అంగీకరించారు. ఇందులో భాగంగా ఫిబ్రవరి 6వ తేదీన ఆయన విద్యార్థులతో ఇంట్రాక్ట్ అయ్యి విద్యార్థులు అడిగే ప్రశ్నలకు జవాబులు ఇవ్వనున్నట్లు హరికృష్ణ గురువారం విలేకరులకు తెలిపారు.

జీవనోపాధి పై అవగాహన కల్పించాలి

వైఎస్సార్ క్రాంతి పథం పీడీ బి.అర్జునరావు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పీడీ అర్జునరావు

చెరుకుపల్లి: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీవనోపాధి అవకాశాలను అందిపుచ్చుకుని పేద కుటుంబాలు తలసరి ఆదాయాన్ని పెంచుకుని, జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలని జిల్లా డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం పీడీ బి.అర్జునరావు పేర్కొన్నారు. మండలంలోని గుళ్లపల్లి నూకాలమ్మ కల్యాణ మండపంలో గురువారం రేపల్లె క్లస్టర్ పరిధిలోని ఐదు మండలాల ఏపీఎంలు, వీఓఎలు, (యానిమేటర్స్), సీసీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పీడీ అర్జునరావు మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం అందిస్తున్న జీవనోపాధి యూనిట్లయిన పాడిగేదెలు, మేకలు, గొర్రెలు, పెరటి కోళ్ల పెంపకంతో పాటుగా హోటల్స్, సెంట్రింగ్ యూనిట్స్, బ్రిక్స్ యూనిట్స్, టెంట్ హౌస్, ఎలక్ట్రికల్ ఆటోలు, వంటి ఎన్నో యూనిట్ల ను వారివారి ఆసక్తి మేరకు బ్యాంకులు, స్త్రీ నిధి ద్వారా రుణాలు ఉపయోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ప్రతి మండలంలో వీఓఏలు విస్తృతంగా పర్యటించి డ్వాక్రా సంఘ సభ్యులకు జీవనోపాధులపై అవగాహన కల్పించాలన్నారు. బాపట్ల జిల్లా డీపీఎంలు సుబ్బారావు, రవికుమార్, రేపల్లె ఏరియా కో-ఆర్డినేటర్ రమాదేవి, స్త్రీ నిధి ఏజీఎం హర్షవర్ధన్, మేనేజర్ రాజకుమార్, ఏపీఎంలు రమేష్‌బాబు, డి.వెంకటేశ్వర్లు, కృపాసాగర్, చంద్రశేఖర్, శోభన్‌బాబు, సీసీలు పాల్గొన్నారు.

అ'పూర్వ'ం.. ఆత్మీయ సమ్మేళనం



నాటి గురువులతో 1978-79 బ్యాచ్ 'పది' పూర్వ విద్యార్థులు

చెరుకుపల్లి: మండలంలోని మునిస్వామి నాయుడు స్మాకర ఉన్నత పాఠశాలలో 1978-79 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం రెండవ రోజు గురువారం కొనసాగింది. ముందుగా వారితో పాటు చదవుకుని మరణించిన తమ స్నేహితులకు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు చదువుకున్న రోజుల్లో చేసిన అల్లర్లు, ఆటపాటలు, ఒకరితోనొకరు కలసి ఆనందంగా పంచుకున్నారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన నలుగురు ఉపాధ్యాయును ఘనంగా సత్కరిచారు, కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కన్నెగంటి పద్మజ, రావి వెంకట నరేంద్ర, అనగాని శ్రీనివాసరావు, తురిమెళ్ల శ్రీధర్, పూషడపు శ్రీమన్నారయణ, తదతరులను వారి ఓల్డ్ స్టూడెంట్స్ అభినందించారు.

కళలు, సంస్కృతిని కాపాడుకోవాలి

తూములూరు(కొల్లిపర): కళలు, సంస్కృతిని కాపాడుకుంటూ భావితరాలకు వాటిని అందించాలని మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం సంక్రాంతి సంబరాలు సందర్భంగా పౌరాణిక నాటకాల్లో సన్నివేశాల పోటీలు తూములూరు లో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు కొల్లి బసివిరెడ్డి, కార్యదర్శి కొండా శివారెడ్డి, కొల్లి రాఘవరెడ్డి, మర్రెడ్డి సాంబిరెడ్డి పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి



కొల్లూరు సచివాలయం-3లో రికార్డులు పరిశీలించి సిబ్బందిని వివరాలడుగుతున్న ఆర్డీఓ పార్థసారథి



ఏట్రవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన డీఎల్‌పీఓ శరత్‌బాబు

సచివాలయ సిబ్బందికి ఆర్డీఓ పార్థసారధి సూచన

కొల్లూరు: సంక్షేమ పథకాలు, ప్రజలకు అవసరమైన సేవలు అందించే విషయంలో సచివాలయ సిబ్బంది ప్రతి ఒక్కరికీ మేలు చేకూరేలా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని రేపల్లె ఆర్డీఓ పార్థసారధి అన్నారు. గురువారం కొల్లూరులోని సచివాలయం-3ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా సిబ్బంది ఉత్తమ సేవలు అందజేసి ప్రజా సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. అనంతరం తుది దశ నిర్మాణంలో ఉన్న సచివాలయంను పరిశీలించారు.

గ్రామ సచివాలయం తనిఖీ

పెనుమర్రు(వేమూరు): గ్రామ సచివాలయ సిబ్బంది విధుల్లోట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ సునీత తెలిపారు. వేమూరు మండలంలోని పెనుమర్రు గ్రామ సచివాలయం గురువారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలని ఆమె చెప్పారు. విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చినపరిమిలోని గ్రామ సచివాలయం, ఆర్బీకే, పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రాలను మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి. జెన్నమ్మ గురువారం సందర్శించారు. సచివాలయంలోని గోడపత్రికలు, అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. బీజేఆర్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలు, గర్భిణులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి ఎ. శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ..

కర్లపాలెం: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని బాపట్ల డీఎల్‌పీఓ పీడీఎస్ శరత్‌బాబు చెప్పారు. గురువారం డీఎల్‌పీఓ ఏట్రవారిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. చిన్నారులకు పెడుతున్న పౌష్టికాహారాన్ని పరిశీలించి చిన్నారుల పఠనా శక్తిని పరీక్షించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని, సంపద సృష్టి కేంద్రాన్ని సందర్శించారు. గ్రామ సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి డి.పద్మావతి, సచివాలయం సిబ్బంది అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

అథ్లెటిక్స్‌లో యడ్లపల్లి జడ్పీ విద్యార్థుల ప్రతిభ



శివనాగరాజు రెడ్డి



అక్షిత్ రెడ్డి

యడ్లపల్లి(వేమూరు): జిల్లాస్థాయి స్కూలు గేమ్స్ అథ్లెటిక్స్ పోటీల్లో యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఝాన్సీ రాణి తెలిపారు. గుంటూరు జిల్లా నంబూరు జడ్పీ పాఠశాలలో గురువారం జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్‌లో చుండూరు మండలం యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎ.శివరాగరాజు రెడ్డి 1500 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానం సాధించారు. ఎస్.అక్షిత రెడ్డి 3000 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం ఈ సాధించారు. ఈ నెల 19వ తేదీ నుంచి శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. విద్యార్థులను, పీఈటీ వేమూరి శరత్‌బాబును ఉపాధ్యాయులు అభినందించారు.